# బాపూ గీసిన తెలుగింటి అమ్మాయి

బాబాయి 'మార్కెట్' నుండి అప్పుడే వచ్చాడు - ఆముదం తాగినట్టు మొహం పెట్టి.

"కాయా. పండా?" అంది పిన్ని అతని ముఖ కవళికల్నైనా గుర్తించకుండా.

"కాయే! తప్పదు" అన్నాడు బాబాయి విసుగ్గా - "మన మొహానికి పండొకటా?"

"ఏం, ఎంచేత?"

"ధరలు విపరీతంగా పెరిగేయి. అతి సామాన్యమైన సంబంధమైనా లకారానికి పైమాటే!" అన్నాడు బాబాయి.

"ఆ మధ్య యాభైవేల కేదో ఉందన్నారు?"

ఎప్పుడూ ఒక్కటే ధరా? ఆ వేళ అంతే ఉంది. ఈ లోగా చాలా మంది వేలంపాట పాడినట్లు - రెండూ మూడు నాలుగూ అంటూ ఐదు దాకా వెళ్ళేరు.

షరా : సమయానుకూలముగా రేట్లు హెచ్చింపబడును"

"ఇదంతా ఎందువల్లంటారు?"

ఎందుకేటి మన ఖర్మ! ఏదో ఫలానా చోట సంబంధం ఉందని తెలిసి, దాని వివరం తెలుసుకోవాలని ఎవరో నమ్మకస్తుణ్ని అడుగుతాం కదూ? ఆ పెద్ద మనిషి ఆ బోగట్టా ఇంకొకరి చెవిన వేస్తాడు. దాంతో వారు పోటీకి తగులుతారు. 'కట్నాలు ఇవ్వరాదు పుచ్చుకోరాదు' అని చట్టం చేయడం వల్ల ఆడపిల్లల్ని కన్న తల్లిదండ్రులు సుఖపడతారని అంతా భానించారు. కాని అంతా తలక్రిందులైంది. అప్పుడు పబ్లిక్కూ ఇప్పుడు బ్లాకును. బ్లాకులో ధర ఎప్పుడూ ఎక్కువే కదా! కట్నాలివ్వరాదంటే ఇచ్చేవాళ్లు మానేస్తారు కాని,

పుచ్చుకునే వాళ్ళ మాటో? వాళ్లు మానరు కదా! అంచేత వీళ్లు ఇవ్వకా తప్పదు" అన్నాడు బాబాయి - "పద - అన్నం వడ్డించు"

పిన్ని అన్నం వడ్డించింది. బాబాయి భోజనం చేస్తూండగా పిన్ని అంది "అయినా ఈ పాడుముండ ఏ ముహూర్తాన పుట్టిందో కాని, పుట్టగానే తల్లిదండ్రుల్ని పొట్టన పెట్టుకుంది. ఇంతా కష్టపడి ఇరవయ్యేళ్ల పాటు దీన్ని పెంచుకొచ్చేమా? రెండేళ్ల నించి సంబంధాలు వెతుకుతున్నామా? ఒకటీ కుదర లేదంటే ఏమనుకోవాలి?"

ఇహ బాబాయి సమాధానం ఉపన్యాస రూపం దాల్చింది.

"అదొక పెద్ద కారణం కాదు. మన అమ్మాయి ఉందే, ఇది కొంచెం కూడా ఆధునిక పద్ధతుల్లో స్టయిల్‌గా ఉండదు. అంటే నేటి ఆడపిల్లల్లాగ ఓ జడ వీపు మీద, ఓ జడ గుండెమీద వేసుకోవడం - కాళ్లక్కొంచెం ఫేషన్‌గా ఉండే ఎత్తు మడమల జోడు తొడుక్కోవడం, మొహానికి స్నో పౌడరు ఫెయిర్ అండ్ లవ్‌లీ వంటి సుగంధ ద్రవ్యాలు అద్దుకోవడం - ఇలాంటి అలవాట్లేవీ లేవు ఈవిడ గారికి! వీటి క్రింద ఓ వంద రూపాయిలు వెచ్చించి కాస్త ఒయ్యారంగా కనిపించిందో - ఎవడో ఒకడు తప్పక పెళ్లి చేసుకుంటాడు తక్కువ కట్నంతో. ఒకవేళ వాడికి రిమ్మెత్తితే పుచ్చుకోక పోవచ్చు కూడాను!"

"అయితే మనమ్మాయికి కూడా అదేదో నేర్ప కూడదూ?" అంది పిన్ని.

"ఒకసారా? లక్షసార్లు చెప్పేను. అయినా వింటేనా? ఈ సారి మాత్రం మోడరన్‌గా కనిపించక పోతే దీని ఒళ్లు హూనం చేసేస్తాను" అన్నాడు బాబాయి కోపంతో ఊగిపోతూ.

"ఈ సారి అంటున్నారు. ఎవడైనా వస్తున్నాడేంటి దీని మొహం చూడ్డానికి?"

"ఆ! వస్తున్నాడు కనుకే ఈ సుదీర్ఘ ఉపన్యాసం"

"అతని ఉద్దేశ్యాలకి అనుకూలంగా వుంటే ఊరికే చేసుకుంటాడట!"

"లేకపోతే అమ్ముడుపోతాడా?" గట్టి ప్రశ్నే వేసింది పిన్ని.

"అస్సలు చేసుకోడే వెర్రి మొహమా!" పళ్ళు కొరుకుతూ అన్నాడు బాబాయి.

"పోనీ మనలో మనకెందుకీ ఘర్షణ? త్వరగా పెళ్లికొడుకుని రప్పించండి" అని సర్దిచెప్పింది పిన్ని.

"అతను సాయంత్రమే వస్తున్నాడు. అమ్మాయిని మనం మోడ్రన్ ఫేషన్‌లో తయారుగా ఉంచడమే తరువాయి"

"అయితా రండి తయారు చేద్దాం"

"రైఠో పద" అంటూ బాబాయి గబగబా చెయ్యి కడిగేసుకున్నాడు.

పిన్ని నన్ను గొంతెత్తి పిలిచింది. వీళ్ల సంభాషణ ఆసాంతమూ చాటు నుంచి విన్న నేను, 'వస్తున్నా పిన్నీ!" అని పరుగెట్టుకు రాలేదు. అలా వస్తే వాళ్ల మాటలు నేను విన్నానని తెలిసిపోతుంది. అంచేత మెల్లగా అడుగులు వేసుకుని వచ్చాను.

పిన్ని అప్పటినుంచీ బాబాయి చెప్పిన విధంగా ఆధునిక అలంకరణ ప్రారంభించింది. మధ్య మధ్యన అర్ధాలంకరణలతో నన్ను బాబాయికి చూపిస్తూ - "ఏమండోయ్ ఇటు చూడండి! ఈ రెండు జెడలు - ఇలాగేనా?" అని అడిగేది.

బాబాయికి నచ్చితే - 'భేష్! అంతే! అంతే! అలాగే!' అనేవాడు. లేకపోతే అవసరమైన సవరణలు చెప్పేవాడు.

అలంకరణ పూర్తయింది.

పెళ్ళికొడుకు వచ్చాడు. వేష భాష ల్లేకుండా చాలా నిరాడంబరంగా ఉన్నాడు. "అమ్మాయినోసారి నించోమనండి" అన్నాడు.

పిన్ని నన్ను ఆజ్ఞాపించకుండానే లేచి నించున్నాను.

వరుడు నా దగ్గరకొచ్చాడు. వెనుక జడనీ, ముందు జడనీ పట్టుకుని అటూ ఇటూ నెమ్మదిగా ఊపేడు. చేతులు చూశాడు. ఓ చేతిని గాజులు, ఓ చేతిని చిన్న రిస్టువాచ్ చూశాడు. బొట్టు అసలు ఉందా లేదా అన్నట్లు పెట్టింది పిన్ని. నా ఒంటి మీది పౌడరు, స్నో, సెంటు ఇత్యాది సువాసనలు నషాళానికి పాకుతుండడం వల్లనేమో, తన ముక్కు మూసుకుని దూరంగా వెళ్లేడు. "ఛీ కంపు!" అనుకున్నాడు మెల్లగా.

ఇహ తను విమర్శ ప్రారంభించాడు.

"మొహాన ఉన్నది బొట్టా లేక పుట్టుమచ్చా? ఓ చేతికి గాజులుండడం - ఓ చేతికి అసలు గాజుల్లేకుండా రిస్టువాచీ ఉండడం - జడల చివర ఊలు ముక్కైనా లేకపోవడం - ఇవి శుభ లక్షణాలు కావు" అని తిరోగమించబోయాడు.

నేను గాబరా పడ్డాను. ఇది నా జీవిత సమస్య. నేను మౌనం వహిస్తే నాకింక వివాహం కాదు. పోనీ నాకు ఉద్యోగం కూడా లేదు. సంపాదన చూసైనా ఎవరైనా పెళ్లి

చేసుకుంటారంటే, గుండెలు కొట్టుకోవడం, చేతులు, పెదవులు వణకడం ప్రారంభించాయి. గబగబా అతన్ని సమీపించాను. వెళ్ళిపోతున్న అతని కాళ్లని పట్టుకున్నాను.

"మీరు  నన్ను క్షమించాలి" అన్నాను. తడబడుతూ.

"నా నిజ రూపం ఇది ఏ మాత్రం కాదు. ఇది నా కృత్రిమ రూపం. ఇలా నేను లేనని, పాత బాణీలో శుద్ధ పల్లెటూరు మొద్దులా ఉంటానని అనేకులు నన్ను వివాహం చేసుకోనన్నారు. అందువల్ల మా పిన్ని - బాబాయి, నా వేషాన్ని మార్చి ఈ విధంగా తయారు చేశారు. మీరొక్క క్షణం ఆగండి" అని ప్రాధేయపడ్డాను.

త్వరగా లోనికి వెళ్లాను. స్నానం చేశాను. ఒంటినుండే సువాసనా ద్రవ్యాలన్నీ పోగొట్టాను. యథారీతిగా మామూలు గాజులు, గచ్చకాయంత బొట్టు, అందెలు, మువ్వలు, ముక్కరలూ ధరించి, మన తెలుగు సంప్రదాయాన్ని స్మృతికి తెచ్చాను. బాపూ గీసిన తెలుగింటి అమ్మాయి బొమ్మనయ్యాను.

ఆయన ఎదుట నిలబడ్డాను. ఆయన నా రెండు భుజాలూ పట్టుకున్నారు.

"ఔను పద! మేరేజ్ రిజిస్ట్రార్ దగ్గరకు. నోటీసిచ్చిన ముప్పయ్ రోజులు దాటేక తొంభైరోజుల్లోగా మేరేజ్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు" అని చెయ్యిపట్టుకుని తీసుకెళ్ళుతున్నారు. మా పిన్ని, బాబాయి మా వెంటనే పరుగెట్టారు.

మరో నెల దాటేక ఆయన అర్ధదేహాన్ని ఆక్రమించాను.

**ఆంధ్రప్రదేశ్ డిశంబర్ 2000**